క్లుప్తంగా

వైభవంగా శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



గన్నవరం: మండలంలోని బుద్దవరం గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత శుభ మంగళ నాదస్వర సేవ, మండప దేవతలకు అర్చనలు, మహా మంత్ర హోమాలు చేశారు. వాస్తు జ్యోతిష్యుడు, వేద పండితుడు జంధ్యాల రాజేశ్వరశాస్త్రి పర్యవేక్షణలో ఉదయం 10.29 గంటలకు 12 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం పూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. స్వామివారిని శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం కమిటీ ఛైర్మన్ కర్నాటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్, వైఎస్సార్ సీపీ నాయకుడు వింత శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, గ్రామ సర్పంచ్ బడుగు బాలమ్మ, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వితీయ వార్షికోత్సవ పూజలు



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి దేవస్థానంలో ద్వితీయ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఆలయంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న పూజా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివార్లకు అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం కంచర్ల సుధాకర్, ఎం.శివకుమార్, కంచర్ల సుధీర్ దంపతులు హోమం చేశారు. వేదాంతం రాజగోపాలచక్రవర్తి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం చక్రస్నానం, పూర్ణాహుతి, పవళింపు సేవ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ బీమా అందజేత



ఉయ్యూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ బీమా అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ ఉయ్యూరు మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని అన్నారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో ఇటీవల గూడవల్లి నరేంద్ర మృతి చెందారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరైంది. తక్షణ సాయం కింద రూ. 10 వేలను నాని బుధవారం బాధిత కుటుంబ సభ్యులు తేజశ్రీకి అందించారు. కార్యక్రమంలో పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రమావత్ శ్రీకాంత్, గ్రామ కన్వీనర్ మెరుగుమాల ఏసుబాబు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల మరమ్మతులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు బుధవారం పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక విజయవాడరోడ్డులో ఎన్‌హెచ్‌ఏఐ, ఏపీ ఆర్డీసీ అధికారులతో కలిసి ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కనుమూరి సుబ్బరాజు రహదారి మరమ్మతుల పనులను పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూ. 9 కోట్లతో హనుమాన్‌జంక్షన్‌లో ప్రధాన రహదారుల మరమ్మతులు, సుమారు 5.2 కిలోమీటర్లు మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నామని సుబ్బరాజు చెప్పారు. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్లు దూరంలో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. అంతేకాక ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ మరమ్మతులు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఉంగుటూరు: పదిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత పొందే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సాంబశివరావు తెలిపారు. ఉంగుటూరు మండలంలోని 9 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్స్ నుంచి 327 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని చెప్పారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆత్కూరు, తేలప్రోలు, పెద అవుటపల్లి, మానికొండ, వెల్దిపాడు, ఇందుపల్లి, ఉంగుటూరు గ్రామాల హైస్కూల్‌లలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

ప్రసాదంపాడులో వలంటీర్లకు వందనం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోటేశ్వరరావు తదితరులు

రామవరప్పాడు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిగా వ్యవహరిస్తూ నిస్వార్థమైన సేవలు అందిస్తున్నారని రూరల్‌మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని అన్నపూర్ణ రైస్ మిల్లు వద్ద బుధవారం మండల స్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రసన్నకుమారి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. సేవాభావంతో యువత ముందుకు వచ్చి వలంటీర్లుగా ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల మందికి పైగా యువ వలంటీర్లు ప్రతీ సచివాలయం పరిధిలో తమ అమూల్యమైన సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కనీవినీ ఎరుగని విధంగా సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లుతున్న వలంటీర్లపై ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రూరల్‌మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు అందించిన సేవలను ఎప్పటికి మరిచిపోలేమన్నారు. గొడ కార్పొరేషన్ ఛైర్మన్ మాదు శివరామకృష్ణ మాట్లాడుతూ వలంటీర్లే జగనన్న సైనికులని, ప్రతీ వలంటీర్ ఒక వజ్రమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు వలంటీర్లు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు, రామవరప్పాడు, ఎనికేపాడు, సర్పంచ్‌లు వరి శ్రీదేవి, రాచమళ్ల పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, పలు గ్రామాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రూ. 19.13 కోట్ల చెక్కు అందజేత



వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద మంజూరైన రూ. 19.13 కోట్ల చెక్కును మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలకు ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు అందజేశారు. ప్రసాదంపాడులో బుధవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా మండల వ్యాప్తంగా 2002 డ్వాక్రా సంఘాలకు నాలుగవ విడతలో రూ. 19.13 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ ఆసరా మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 2.20 లక్షలు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ సంజీవనిలా భరోసానిస్తోందని జేసీఎస్ మండల కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి అన్నారు. తేలప్రోలు గ్రామానికి చెందిన వింత మాధవరెడ్డి కండరాలు, నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఉన్నత వైద్యం కోసం ఆసుపత్రిలో చికిత్సనందించిన వైద్యులు ఒక్కో ఇంజక్షన్ రూ. 60 వేలు ఉంటుందని, మొత్తం 12 ఇంజక్షన్‌లు చేయాలని చెప్పారు. వైద్యం చేయించుకునేందుకు మాధవరెడ్డి ఆర్థికంగా ఇబ్బంది పడటాన్ని తెలుసుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు రూ. 2.20 లక్షలు మంజూరు చేయించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కును మాధవరెడ్డి కటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు వింత శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తియ్యగూర వాణి, పీఏసీఎస్ ఛైర్మన్ తియ్యగూర రామిరెడ్డి, కొల్లి బసవరెడ్డి, భీమవరపు చంద్రశేఖర్‌రెడ్డి, జొన్నల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు పట్టుదల, సమయపాలన, నిర్దిష్ట ప్రణాళికతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం రామన్నగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్ లక్ష్య సాధన నిర్దేశించుకుని దానికి అనుగుణంగా విద్యార్థులు చదవాలని చెప్పారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ప్రతిభ చాటిన 6, 7, 8, 9వ తరగతి విద్యార్థులకు నగదు బహుమతితో పాటుగా జ్ఞాపిక, పెద్ద బాలశిక్ష పుస్తకం, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సీనియర్ సభ్యుడు కొట్నాని రామచంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరహరిశెట్టి శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



మహిళా రైతుకు బహుమతి అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

పెనమలూరు: లేగదూడల పెంపకంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుగణాభివృద్ధి ఉప సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. చోడవరం గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయన్నారు. నాలుగేళ్లలో గ్రామాల్లో పాల ఉత్పత్తి రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. దీంతో పశుపోషణ లాభదాయకంగా మారుతుందని తెలిపారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పశుపోషకులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవతో ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. పశు సంరక్షణపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, పశువైద్యులు శ్రీనివాసరావు, బాబూరావు, మాధవరావు, దీప్తి, కృష్ణ కుమారి, శివరామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి, నున్న, మాదలవారిగూడెం ప్రాంతాల్లో గురువారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. నున్న విద్యుత్ సరఫరా కేంద్రం పరిధిలో మెయింటెన్స్ నిమిత్తం చర్యలు చేపట్టినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు మండల స్థాయి వలంటీర్లకు వందనం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు మండల స్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వలంటీర్లు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



పునాదిపాడు కాలువలో మురుగును పరిశీలిస్తున్న జిల్లా అధికారుల బృందం



పునాదిపాడు పంచాయతీలో విచారణ చేస్తున్న జిల్లా అధికారులు

కంకిపాడు: మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా అధికారుల బృందం స్పష్టం చేసింది. శ్రీచైతన్య విద్యాసంస్థల మురుగు కారణంగా ఇబ్బందులు పడుతున్న పునాదిపాడు వాసులు సమస్య పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయడంతో శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఇందులో భాగంగా ఆర్డీఓ రాజు, డీపీఓ నాగేశ్వరనాయక్, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీవీ రమణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఏఈ మల్లికార్జున, ఎంపీడీఓ పి.అనూష, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు నేతృత్వంలోని బృందం పునాదిపాడు గ్రామ పంచాయతీని బుధవారం సందర్శించింది. గ్రామ పరిధిలోని శ్రీచైతన్య విద్యాసంస్థల నుంచి బయటకు విడుదల చేస్తున్న మురుగుతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, ప్రజారోగ్యానికి భద్రత లేకుండా పోయిందని విచారణ బృందానికి స్థానికులు వివరించారు. దీంతో అధికారుల బృందం విద్యాసంస్థల నుంచి నేరుగా మురుగు బయటకు పంపడానికి అవకాశం లేదని, ట్రీట్మెంట్ ప్లాంట్‌ను విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన మురుగు రైవస్ కాలువ వెంబడి ఉన్న మురుగుకోడులో కలిసేలా చూడాలని స్పష్టం చేశారు. మురుగు వల్ల ఇబ్బందులు తలెత్తకుండా తీసుకునే చర్యలపై రెండు రోజుల్లో నిర్ణయం చెప్పాలని, తదనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు విద్యాసంస్థల ప్రతినిధులతో రాతపూర్వక అంగీకార పత్రాలను తీసుకున్నారు. ఈఓ బీ వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న పూజారి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న శ్రీనందీశ్వర స్వామివారికి త్రయోదశి సందర్భంగా అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీవీఆర్ సాగర్ పూజలు నిర్వహించారు. శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామివారి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

పెనమలూరు: భార్యపై ఇటుకరాయితో దాడి చేసిన భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు గ్రామానికి చెందిన తోట జ్యోతి 13 సంవత్సరాల క్రితం పామర్రుకు చెందిన అయ్యప్పస్వామి అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా గత ఏడాదిన్నర నుంచి భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకోవడంతో భార్యభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. మంగళవారం జ్యోతితో అకారణంగా గొడవపడిన భర్త ఇటుక రాయితో ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె తలకు గాయమయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు.

కోలాహలంగా వీరమ్మతల్లి తిరునాళ్లు



ఆలయం వద్ద భక్తజన సందోహం

ఉయ్యూరు: ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు భక్తజన కోలాహలంతో సందడిగా మారింది. ఆలయ ప్రవేశం చేసిన అమ్మవారిని బుధవారం వేకువజాము నుంచే భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పొంగలి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. గ్రామాల నుంచి డప్పు వాయిద్యాలతో చలువ కావిళ్లతో భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని భక్తిపారవశ్యం చెందారు. సీఐ హబీబ్‌బాషా, ఎస్సై గణేష్‌కుమార్‌లు తిరునాళ్ల బందోబస్తును పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాలు



ఆలయంలో ఉత్సవమూర్తులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. సాయంత్రం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ మాతృ మండలి సభ్యులతో కోలాట ప్రదర్శన నిర్వహించారు. అలాగే చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ నెల 23వ తేది రాత్రి 8.10 గంటలకు జరగనున్న అమ్మవారి కల్యాణాన్ని పరిసర గ్రామాల భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ కోరారు. పలువురు పుర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

పెనమలూరు: వణుకూరులో భార్యపై భర్త దాడి చేసి గాయపర్చడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు కాసాకాలనీకి చెందిన గోగులమూడి జ్యోత్స్న, గంగాధరరావు భార్య భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను వేధించడంతో ఆమె పిల్లలతో హనుమాన్‌జంక్షన్ వద్ద వసంతవాడకు వెళ్లి బంధువుల ఇంట్లో ఉంటుంది. జ్యోత్స్న ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో భర్త వేధింపులపై ఈ నెల 10వ తేదీన ఫిర్యాదు చేసింది. పోలీసులు భర్తను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. జ్యోత్స్న, పిల్లల వస్తువులు భర్త వద్ద ఉన్నందున అవి తీసుకువెళ్లడానికి మంగళవారం వణుకూరులో భర్త ఉండే ఇంటికి వచ్చింది. దీంతో భర్త ఆగ్రహంతో భార్యపై కర్రతో దాడి చేయగా ఆమె తలకు గాయమయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉదయశ్రీకి యూనివర్సల్ ఇన్నోవేటర్స్ లీడర్‌షిప్ అవార్డు



డాక్టర్ ఉదయశ్రీకి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

నున్న(విజయవాడరూరల్): విజయవాడ పర్వతనేని బ్రహ్మయ్య సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీకి యూనివర్సల్ లీడర్‌షిప్ అవార్డు(యూఐఎల్ఏ-2024) -మల్టీ డిసిప్లీనరీ ఉమెన్ రీసెర్చ్ ఇన్ ఆస్ట్రాలజీ అవార్డు లభించింది. ఎన్ఐటీ-పాట్నా, యూనివర్సిటీ ఆఫ్ వల్లడోలిడ్-స్పెయిన్ సంయుక్తంగా యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని షహీద్ సుఖదేవ్ కాలేజ్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ ఆవరణలో ఏడవ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేటీస్ కంప్యూటరింగ్, కమ్యూనికేషన్(ఐసీఐసీసీ-2024) కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ పూనం వర్మ, ఎన్ఐటీ-కురక్షేత్ర ప్రొఫెసర్ ఏకే సింగ్ షీల్డ్, ప్రశంసాపత్రాన్ని డాక్టర్ ఉదయశ్రీకి అందజేశారు. మల్టీ డిసిప్లీనరీ ఉమెన్ రీచెర్స్‌గా ఇన్నోవేటర్స్ లీడర్ షిప్ అవార్డు అందుకున్న డాక్టర్ ఉదయశ్రీని డైరెక్టర్ బాబురావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్‌లు అభినందించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంధన పొదుపు కార్యకలాపాలను అమలు చేయాల్సిన ఆవశ్యకతలో భాగంగా కేవలం ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని హైదరాబాద్‌కు చెందిన సిరి ఎన్హర్జీ అండ్ కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. నగర పాలక సంస్థ నూతన భవనం సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్ లెవల్ ఇంజినీరింగ్ సిబ్బందికి ఇంధన పొదుపుపై వర్క్‌షాప్ నిర్వహించారు. పంప్ ఆపరేటర్లకు మున్సిపాలిటీల్లో ఎనర్జీ ఎఫిషియన్సీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. మున్సిపల్ వాటర్ పంపింగ్, స్ట్రీట్ లైటింగ్‌లో ఇంధనాన్ని ఆదా చేయడం గురించి చెప్పారు. ఇంధన శక్తి పొదుపులో భాగంగా విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా స్థిరత్వాన్ని కాపాడుకునేందుకు కార్బన్ ఉద్గారాలను తగ్గించేటప్పుడు బొగ్గు, చమురు, గ్యాస్ వంటి వేగంగా క్షీణిస్తున్న వనరులను కూడా సంరక్షిస్తుందని వెల్లడించారు. వివిధ రంగాల్లో పొదుపు చేయాలంటే వీధి దీపాల్లో 5-10 శాతం, పంపింగ్‌లో 20-25 శాతం, మురుగునీటి పంపింగ్‌లో 15-20 శాతం, మున్సిపల్ భవనాల్లో 5-10 శాతం చేయవచ్చని వివరించారు. సమావేశంలో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఇసీఎమ్) డిఇఇ జీ శ్రీనివాసులు, నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) ఎస్.ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార రెడ్డి మున్సిపాలిటీల్లో ఇంధన సామర్థ్యంపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

పాన్ ఇండియా వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం



వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న గద్దె అనురాధ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పెళ్లిళ్లు, శుభకార్యాలు, పండుగల సీజన్ సందర్భంగా బందరు రోడ్‌లోని ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో పాన్ ఇండియా వెడ్డింగ్ వోగ్స్ జ్యూయలరీ అండ్ వెడ్డింగ్ షో ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌ను కృష్ణా జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, బొండా సుజాత, యార్లగడ్డ జ్ఞానేశ్వరి, రాధిక, మాధవి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 75 ప్లస్ లగ్జరీ బ్రాండ్స్ స్టాల్స్ వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. అలాగే ప్రముఖ బ్రాండెడ్ జ్యూయలరీ షోరూమ్స్, క్లాత్ వేర్ షోరూమ్స్ నిర్వాహకులు గోల్డ్, డైమండ్, శారీస్, డ్రెసెస్ ఇతర ఉత్పత్తులను అమ్మకం కోసం ఇక్కడ ఏర్పాటు చేశారు. అదే విధంగా డిజైనర్ వేర్, క్లాతింగ్ మెటీరియల్, చీరెలు, ఫ్యాషన్ యాక్ససరీస్, జ్యూయలరీ ఐటెమ్స్‌తోపాటు ఒక గ్రాము జ్యూయలరీ కూడా అందుబాటులో లభిస్తున్నాయని నిర్వాహకులు సజ్జా అన్నపూర్ణ, నిరంజన్ తెలిపారు.

సోషలిజం నాయకులకు రెడ్ బుక్ దిక్సూచి

గన్నవరం: సోషలిజం కోసం పాటుపడే నాయకులకు రెడ్ బుక్ ఒక దిక్సూచి వంటిదని ఆర్థిక విశ్లేషకుడు గన్నె వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం రెడ్ బుక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక ఉద్యమాన్ని ముందుకు నడిపించే క్రమంలో పని పట్ల అవగాహన పెంచేందుకు రెడ్‌బుక్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్మిక చైతన్యం కోసం లెనిన్ రాసిన ఈ పుస్తకాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా అతి సాధరణమైన భాషలో సంక్షిప్తీకరిస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ఎం.విజయకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మల్లంపల్లి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కంకిపాడు: ఆటోను టిప్పరు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాకురోడ్డులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గొడవర్రు గ్రామం వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అదే మార్గంలో వెళ్తున్న టిప్పరు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.